క్లుప్తంగా

మహిళలు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలి

మేడిపల్లి: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జగిత్యాల జిల్లా అదనపు డీఆర్డీవో సునీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ గా దొరికే పండ్లను తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు రమేశ్, నారాయణ, ఏపీఎంలు అశోక్, రత్నాకర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరోజ, సీబీవో ఆడిటర్ దాసు,. సీసీలు శ్రీనివాస్ రాజు,కార్యదర్శి వనజ, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ క్రీడాకారులతో సీఐ, ఎస్సై

కథలాపూర్: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో ఆవరణలో నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ టోర్నీని మంగళవారం కోరుట్ల సీఐ సురేశ్‌బాబు ప్రారంభించారు. విద్యార్థులు, యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు క్రీడా పోటీలు పోలీస్‌శాఖ తరుపున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంగూర్ విద్యార్థులకు మద్రాస్ ఐఐటీ కోర్సులు



ఐఐటీ కోర్సులను వివరిస్తున్న టీచర్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మద్రాస్ ఐఐటీ చేపట్టిన స్కూల్ కాన్సెప్ట్ కార్యక్రమానికి ఎంపికై యింది. పాఠశాలలోని డిజిటల్ తరగతి గదులు, పాఠశాల పనితీరును పరిశీలించిన ఐఐటీ మద్రాస్ బృందం తుంగూర్ పాఠశాలను భాగస్వామిగా ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. దీని ద్వారా ఆసక్తి ఉన్న పదో తరగతి విద్యార్థులకు డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ సిస్టం వంటి 10 అంశాల్లో కోర్సులను బోధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు తరలి రావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కోరుట్ల: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఆగస్టు 3 న జరిగే ఎరుకల హక్కుల పోరాట సమితి 29 వ ఆవిర్భావ వేడుకలకు తరలి రావాలని ఆదివాసీ ఎరుకల ఉద్యమ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో మంగళవారం కరపత్రం, క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, గౌరవ అధ్యక్షుడు బక్కయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు భూమయ్య, నాయకులు లోకిని వెంకటేష్, సాలయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్ పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 23న చేపడుతున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గణేశ్ అన్నారు. ఎస్కేఎన్ఆర్ కళాశాలలో మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు బకాయిలను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలను విడుదల చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి మణితేజ పాల్గొన్నారు.

గంజాయి విక్రయించినా, రవాణా చేసిన చర్యలు

గొల్లపల్లి: గంజాయి విక్రయించినా, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గొల్లపల్లి మండలం లొత్తునూర్ శివారులో అనుమానాస్పదంగా కన్పించిన మనోజ్ అనే వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద 90 గ్రాముల గంజాయి లభ్యమైందని, అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అమృత్‌కు మోక్షమెప్పుడో...?

- సేకరించిన 20 గుంటల భూమి
- అనుమతి కోసం ఎదురుచూపు
- అమృత్ జలం కోసం రూ.15 కోట్లు మంజూరు



రాయికల్ పట్టణం

రాయికల్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకానికి శ్రీకారం చుట్టింది. రాయికల్ బల్దియాకు రూ.15.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పట్టణంలోని 12 వార్డుల్లోని 20 వేల జనాభాకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సి ఉంది. నిధులు మంజూరై రెండేళ్ల గడుస్తున్నప్పటికీ అమృత్ 2.0కు స్థలం లేకపోవడంతో పనులకు మోక్షం కలగడం లేదు.

ల్యాండ్ అక్వేషన్ అనుమతి కోసం ఎదురుచూపు..

అమృత్ 2.0 పథకం కింద రాయికల్ బల్దియాకు రూ.15 కోట్లు నిధులు మంజూరై టెండర్ పూర్తయినప్పటికీ కనీసం 20 గుంటల స్థలం సైతం లేకపోవడంతో ఇటీవల రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించి రాయికల్ పట్టణంలోని కుర్మ మల్లారెడ్డికి సంబంధించిన 988/2/1/3/1లో 0.666 గుంటలు, కుర్మ నారాయణరెడ్డికి చెందిన 988/2/1/2/1/1లో 0.666, కుర్మ ప్రేమ్‌రెడ్డికి చెందిన 988/2/1/1/1/1లోని 0.666 గుంటల భూమి, మొత్తంగా 20 గుంటల పట్టా భూమిని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి ల్యాండ్ అక్వేషన్ అధికారులకు నివేదికలు అందజేశారు. ఇటీవల నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ ల్యాండ్ అక్వేషన్ అనుమతి రాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. మరి కొద్ది రోజుల్లో అమృత్ 2.0 నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే బల్దియాలో 15 కి.మీ మేర పైప్‌లైన్ నిర్మించి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ స్పందించి ల్యాండ్ అక్వేషన్ అనుమతిని లభించేలా చొరవ చూపాలని బల్దియా ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు రాగానే పనులు ప్రారంభం



రాయికల్ అమృత్ 2.0 పనుల కోసం ఇటీవలే 20 గుంటల పట్టా భూమిని రైతుల వద్ద సేకరించి ల్యాండ్ అక్వేషన్ అనుమతికి ప్రతిపాదనలు పంపించి 60 రోజులు గడిచింది. ల్యాండ్ అక్వేషన్ అనుమతులు రాగానే పనులు చేపట్టేలా చర్యలు చేపడతాం. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

– మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్





వెల్గటూర్, వర్షకొండలో బోనాలతో వస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాఠశాలల్లో బోనాలు

వెల్గటూర్: మండలం లోని కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాలలో ఆషాఢ మాస బోనాలు, గోరింటాకు వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలు ఎత్తుకొని శివసత్తులు, పోతరాజుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల విన్యాసాలతో డప్పుల చప్పుళ్లతో బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఎల్లమ్మకు నైవైద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేందర్, మాజీ ఎంపీటీసీ వెంకట్, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాభర్తను స్వదేశానికి తీసుకురండి'



ఫిర్యాదు చేస్తున్న బాధితుడి భార్య, తల్లి

గొల్లపల్లి: తన భర్త కడ మల్లేశ్ దుబాయ్‌లో బ్యాంక్ ఖాతాలో ఇల్లీగల్ మనీ ట్రాన్‌జాంక్షన్ కేసులో చిక్కుకున్నాడని, ఆయనను తిరిగి స్వగ్రామానికి తెప్పించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ ప్రజావాణి కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లేశ్ భార్య సరిత, తల్లి భూమక్క ఫిర్యాదు చేశారు. తన భర్త మల్లేశ్ ఎలాంటి నేరం చేయకున్నా దుబాయ్‌లో అక్రమంగా కేసు నమోదు చేశారని, 9900 దరమ్స్ చెల్లించడంతోపాటు కోర్టు జైలు శిక్ష ఖరారు చేసిందని వాపోయింది. కూలీ పని చేసుకునే తమ వద్ద అంత డబ్బు లేదని, ఐదు నెలలుగా పని లేకపోవడంతో తినడానికి తిండి లేక ఆరోగ్యం బాగా లేక బాధపడుతున్నాడని, ఇంటి వద్ద పిల్లలు ఏడుస్తున్నారని, ప్రభుత్వం ఆదుకుని తన భర్తను ఇంటికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలక గుర్తింపునిస్తామన్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బీఆర్ఎస మండల నాయకుడు బోయిన్ పల్లి అరుణ్ రావు, మద్దుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ గౌడ్, సత్యం రావు, 30 మంది అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, దారం ఆదిరెడ్డి,, మల్యాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి వెల్మ లక్ష్మారెడ్డి మిట్టీ శ్రీనివాస్, నులుగొండ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లు అందించేందుకు కృషి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న విప్

మేడిపల్లి: మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపుపై 'డబుల్ భాగ్యం దక్కేదెప్పుడో' అని సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. మేడిపల్లి పర్యటనలో ఉన్న విప్‌ను మండల కేంద్రంలో లబ్ధిదారులు కలిసి తొమ్మిదేళ్లగా ఎదుర్కొంటున్న బాధలు వివరించారు. విప్ స్పందిస్తూ ఎందుకు ఇంత జాప్యం జరిగిందో తెలపాలని, డబుల్ బెడ్ రూం లకు సంబంధించిన వివరాలు తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఆందోళన చెందొద్దన్నారు. సాధ్యమైనంత తొందరగా విధి విధానాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మెట్‌పల్లి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన 29 మందికి మంజూరైన రూ.5.68లక్షల ఆర్థికసాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందజేశారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం



నడికట్ల సందీప్

జగిత్యాల/కోరుట్ల: అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్కేఎన్ఆర్ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇంగ్లిష్–1, కామర్స్–2, కంప్యూటర్స్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ –1, పొలిటికల్ సైన్స్ –1, జువాలజీ –1 , బాటనీ 1, కెమిస్ట్రి 1, మ్యాథ్స్ 1 ఖాళీలున్నాయని, అభ్యర్థులు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులుండి నెట్, సెట్, పీహెచ్‌డీ, టీచింగ్ అనుభవం గల వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 24న బయోడెటాతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 26న ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

కోరుట్ల..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 1, గణిత శాస్త్రం 1, రసాయన శాస్త్రం 1, తెలుగు 1, డైరీ సైన్స్ 1, చరిత్ర 1, బోధించుటకు అతిథి అధ్యాపకుల అవసరం ఉందన్నారు. పీహెచ్‌డీ, నెట్,సెట్ కలిగి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 25వ తేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు అకడమిక్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్ సెల్ నెంబర్ 9989738117లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలు చెల్లించండి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

ఇబ్రహీంపట్నం: ఈ పంచాయతీ ఆపరేటర్లకు 3 నెలలుగా జీతాలు లేవని వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రామకృష్ణరాజుకు వినతిపత్రం అందించారు. ఆపరేటర్లకు 3 నెలలుగా జీతాలు రావడం లేదని, జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈ పంచాయతీ ఆపరేటర్లు నరేశ్, ఆశోక్, స్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు తక్షణమే వేతనాలు చెల్లించాలని మంగళవారం సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చౌడారపు గంగాధర్, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డిలకు వినతిపత్రం అందజేశారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన

జగిత్యాలటౌన్: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి స్పందన వచ్చిందని డిపో మేనేజర్ కల్పన తెలిపారు. జగిత్యాల, పరిసర మండలాల నుంచి 15 మంది వికలాంగుల పాస్‌ల జారీ, మంచిర్యాల, వెల్గటూర్ తదితర రూట్లలో బస్ సర్వీసుల పెంపుతో పాటు ఆదిలాబాద్, ముంబాయిలకు నూతన బస్ సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం జగిత్యాల బస్‌స్టాండ్ ఆవరణలో నిర్వహించే (మహాలక్ష్మి సక్సెస్ మీట్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎం కోరారు.

వాలీబాల్ పోటీల విజేత నమిలికొండ

మల్యాల: మండల కేంద్రంలో సర్కిల్ పరిధిలోని మల్యాల, పెగడపల్లి, కొడిమ్యాల మండలాలకు చెందిన క్రీడాకారులతో నిర్వహించిన వాలీబాల్ ఫైనల్ పోటీలో నమిలికొండ టీం విజేతగా నిలిచింది. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 7 టీంలు పాల్గొనగా, మంగళవారం నిర్వహించిన ఫైనల్‌లో కొడిమ్యాల మండలం నమిలికొండ టీం, పెగడపల్లి మండలం టీంలు తలపడగా, నమిలకొండ టీం విజేతగా నిలిచింది. మల్యాల సీఐ నీలం రవి విజేత టీంకు ట్రోఫీ బహూకరించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేశ్‌కుమార్, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

యూజీసీ నెట్ ఫలితాల్లో ఎస్కేఎన్ఆర్ విద్యార్థి అర్హత

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఎస్కేఎన్ఆర్ కళాశాలలో 2021–22 విద్యా సంవత్సరంలో బీకాం పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకాం చేసిన రాజశేఖర్ యూజీసీ నెట్ ఫలితాల్లో అర్హత సాధించారు. సోమవారం ప్రకటించిన యూజీసీ నెట్ అర్హత ఫలితాల్లో రాజశేఖర్ ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, కామర్స్ అధ్యాపకులు గోవర్ధన్, లెఫ్టినెంట్ రాజు, సాయి, మధుకర్, సురేందర్ అభినందించారు.

అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల పనులు చేపట్టాలి

కథలాపూర్:మండలంలోని తాండ్ర్యాల, అంబారిపేటలోని జెడ్పీ హైస్కూళ్లను డీఈవో రాము మంగళవారం తనిఖీ చేశారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఐదు నెలల క్రితం మంజూరైనందున పనులు ప్రారంభించాలన్నారు. జిల్లా సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, రాజేశ్, ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు కిషన్‌రావు, స్వామి ఉన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలి

మెట్‌పల్లి: సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ నీతా పేర్కొన్నారు. పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆషాఢ మాస గోరింటాకు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్‌లో మంగళవారం భారత జాతీయ జెండా ఆవిష్కరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1947 జులై 22న రాజ్యాంగం ఆమోదించిన , పింగళి వెంకయ్య రూపొందించిన మన తిరంగా జెండా ప్రాముఖ్యతను కరస్పాండెంట్ చౌకి రమేశ్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జెండాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత సైన్యంలో సేవలందించిన సైనికులను, పలువురు పాఠశాలల కరస్పాండెంట్లను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోరుట్ల అధ్యక్షుడు కొమ్ముల జీవన్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి గంగాదర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించారు. జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో 83 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు టీబీ పరీక్షలు నిర్వహించి ఫలితాన్ని వెల్లడించారు.అనంతరం పలువురు వైద్యులు మాట్లాడుతూ టీబీ రోగా నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచిత మందులతో పాటు పోషణ భత్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, వైద్యులు నాగార్జున,క్లినికల్ కౌన్సిలర్ తిరుపతి,సూపర్‌వైజర్ అచ్యుత్‌రావు,కార్యదర్శి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ధర్మపురి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు గ్రామ గ్రామాన వెళ్లి ప్రతీ ఒక్కరిని కలుసుకుని పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వైకుంఠం, మురళి, సంగెపు గంగారాం పాల్గొన్నారు.

24న ఉచిత కంటి వైద్య శిబిరం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ నిర్వాహకుడు సుదర్శన్ తెలిపారు. ఇందులో కంటి చూపు సరిగ్గా లేనివారికి, కంటిలో శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డులు తెచ్చుకోవాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

ధర్మపురి (బుగ్గారం): రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గాలిపెల్లి మహేష్ అన్నారు. మండలంలోని శెకల్ల గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లను కైవసం చేసుకోవడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తప్పుతోవ పట్టించిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకాన్ని గౌరవించాలి

ధర్మపురి: త్రివర్ణ పతాకాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని మండల విద్యాధికారి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో జాతీయ పతాక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ పిన్న శ్రీనివాస్, అధ్యక్షుడు మామిడాల రవీందర్, పప్పుల శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

మెట్‌పల్లి: పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అధ్యక్షులు వెల్ముల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆరపేట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జాతీయ జెండా దినోత్సవాన్ని నిర్వహించారు. నోట్స్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్‌కు స్పాట్ అడ్మిషన్లు

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి శోభారాణి మంగళవారం తెలిపారు. మొదటి సంవత్సరంలో సీఈసీ 10 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫీమేల్ 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 23లోపు స్పాట్ అడ్మిషన్లు పొందాలని, వివరాలకు 80084 76752 సంప్రదించాలని కోరారు.

మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మల్యాల: మండల కేంద్రంలోని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బ్లాక్ చౌరస్తాలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్, మాజీ ఎంపీపీ శ్రీలత, పాక్స్ చైర్మన్లు అయిల్నేని సాగర్‌రావు, మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: మండలంలోని మూలరాంపూర్‌లో కొన్ని రోజుల క్రితం గూడ గంగాధర్ అనే వ్యక్తి దాడి చేసిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ రవి నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం..గ్రామానికి చెందిన గూడ రవి(36)కు అతడి పెద్దనాన్న కుమారుడు గంగాధర్‌తో ఓ వ్యవసాయ భూమి విషయంలో వివాదం నెలకొంది. ఈనెల 9 తేదీన గంగాధర్ ఇద్దరి పొలాల మధ్య ఉన్న ఒడ్డును చెక్కుతుండగా, దీనిని గమనించిన రవి ఎందుకు అలా చేస్తున్నావని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహించిన గంగాధర్ అతని చేతిలో ఉన్న పారతో రవిపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు మొదటి మెట్‌పల్లికి ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నీటిగుంతలో పడి కార్మికుడి మృతి

పెగడపెల్లి: నీటిగుంతలో పడి కార్మికుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని నందగిరిలో ఓ గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న కార్మికుడు సాని (19) మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృతి చెందాడు. మృతుడిది రాజస్థాన్‌లోని చురు జిల్లాగా పోలీసులు గుర్తించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా దాశరథి జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయికల్: ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి వేడుకలు రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాశరథి కృష్ణమాచార్య జీవిత విశేషాలను ఆయన చేసిన రచనలను సాహిత్య రంగంలో ఆయన కృషిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.